# చిత్ర ప్రాణి

గొలుసు కథ-2.




సిల్వర్‌స్టార్ రెస్టారెంటు రూఫ్ గార్డెన్‌లో కూర్చుని, ఒక సిప్ కాఫీ, ఒక పఫ్ సిగరెట్ ఎంజాయ్ చేస్తున్నాడు, ఒక యువకుడు. అతనికెదురుగా కాఫీ సిప్ చేస్తున్నాడు అతని మిత్రుడు!

"ఏదైనా ఒక అడ్వెంచర్ చెయ్యాలనిపిస్తుంది. యేది బెటర్?" సిగరెట్టు పొగ వదులుతూ అడిగాడు మిత్రుడ్ని.

"బెస్టు ఛాయిస్ యీజ్ బ్యాంక్ రాబరీ! దేశంలో నాలుగు మూలలా బ్యాంక్ దొంగతనాలు జరిగి లక్షలకి లక్షలు పోతున్నా, యెక్కడా, యెవర్నీ పట్టుకున్న జాడ కనిపించడంలేదు! కనుక, అదైతే, ఒక్కసారితో! లాట్ మారిపోతుంది!" మిత్రుడి సలహా.

"డబ్బు సంపాయించినా, సంపాయించకపోయినా, లైఫ్‌లో ఒక థ్రిల్ కావాలి! అందుకు స్కూటరో, కారో లాగించొచ్చు! లేదా, మోటార్ సైకిల్ మీద వెళుతూ, ఆడవాళ్ళ మెళ్ళో చైను లాగొచ్చు! లేదా ఏ మలేరియా డిపార్టుమెంటు వాడిననో, రేషన్ కార్డు వెరిఫికేషన్‌కి వచ్చాననో, యిళ్ళల్లో దూరి, ఆడవారిని బెదిరించి, నగలు లాగొచ్చు! కానీ, వీటన్నిటికన్నా, యెవడినైనా కంగు తినిపించాలి! మనమిచ్చిన షాకుతో, వాడు తేరుకోడానికి కొంతకాలమైనా పట్టాలి! లేదా యీ హైద్రాబాద్ విడిచిపోనన్నా పోవాలి!" అంటూ ఆకాశంకేసి సాలోచనగా చూశాడు అడ్వంచరిస్టు.

"అయితే యింకా ఆలోచన దేనికి! మన కొత్త పోలీసు కమీషనర్‌ని ఎయిమ్ వెయ్యి!"

"వెరీగుడ్! బ్రిల్లియంట్ ఐడియా! రేపు కలుద్దాం!" అంటూ లేచాడు అద్వంచరిస్టు.

"బెస్టాఫ్ లక్!" అంటూ లేచాడు మిత్రుడు.

అద్వంచరిస్టు లిఫ్టులో కిందికొచ్చాడు. పార్కింగ్ ప్లాట్‌లోని ఒక్కో స్కూటర్ హేండిల్‌ని కదుపుతూ వెళ్ళాడు. తాళం వెయ్యని బండిని కనిపెట్టి, ఒక్కసారి వెనుకా ముందూ చూసి, చక్‌మని స్టార్టు చేసి, బయటికి దూసుకుపోయాడు.

పోలీసు కమిషనర్ యింటి ముందుగా స్లోగా, పరిశీలిస్తూ వెళ్ళాడు. ఆ స్కూటర్‌ని యింకో హోటల్ దగ్గర పార్క్ చేసి, బయటికొచ్చాడు.

ఒక లారీని మాట్లాడుకుని, యెక్కి కూర్చున్నాడు. లారీ తిన్నగా కమిషనర్‌గారింటికి సాగింది. దారిలో ఒక చౌరస్తా వద్ద ఆపి, ట్రాఫిక్ కానిస్టేబుల్‌ని పిలిచాడు.

"కమిషనర్‌గారు సోఫా డిజైన్ మార్చమన్నారు. దాన్ని లారీలో ఎక్కించాలి! నీకు చెబితే యెవరినైనా పంపుతావన్నారు" అన్నాడు.

"అలాగా! అడుగో ఆ సంధి పట్టుకెళ్ళే కానిస్టేబుల్..." అని బిగ్గరగా విజిల్ వూదాడు. అతన్ని వెంటనే రమ్మన్నాడు. రాగానే, సంగతులు చెప్పి, లారీ యెక్కి పొమ్మన్నాడు.

కానిస్టేబుల్ త్రీనాట్ టూ తో సహా లారీ వెళ్ళి, యే అడ్డంకూ లేకుండా తిన్నగా పోలీసు కమిషనర్‌గారి కాంపౌండులో ఆగింది.


త్రీనాట్ టూ చేతిలోని కూరలసంచి లోపల పెట్టి, సెంట్రీ సాయంతో వరండాలో కనిపిస్తున్న అయిదువేల రూపాయల సోఫాను లారీలోకి యెక్కించాడు. లారీకి రైట్ చెప్పాడు. లారీ కదిలింది. అద్వంచరిస్టు సన్నమీసాలు సవరించుకున్నాడు.

అదే సమయానికి లోపలినుంచి కమిషనర్‌గారి తల్లి వరండాలోకొచ్చి, యేమిటిదని అడిగింది.

"అయ్యగారు సోఫా డిజైన్ మార్చమని పంపారు" అన్నాడు త్రీ నాట్ టు.

"అన్నీ అనవసరపు ఖర్చుల'ని విసుక్కుని లోపలికి వెళ్ళింది ఆమె.

ఆదివారం పదకొండు గంటలకల్లా శర్మ, రామకృష్ణ,




వెంకోజీ, రామయ్య మాస్టారు టాక్సీలో కమిషనర్ గారింటి వద్ద దిగారు. పళ్ళు, స్వీట్సు తీసుకొచ్చారు.

భాస్కర్ తల్లి వారిని సాదరంగా ఆహ్వానించింది. భాస్కర్ రాత్రి యింటికి రాలేదని, యెవరో ఫారిన్ నుంచి మన మంత్రులు తిరిగి వస్తే, ముఖ్యమంత్రితో పాటు వుండాల్సొచ్చిందని, మీ భోజనాలకి యేర్పాట్లు చెయ్యమన్నాడని చెప్పింది.

అంతలో భాస్కర్ భార్య శ్యామల వచ్చింది. ఆమెకు మాస్టారు అందర్నీ పరిచయం చేశారు.

ఈ పాడు ఉద్యోగమే ఇంతని, వేళాపాళాలుండ వని, దానికి రాజీమానా యిచ్చి, యింకేదైనా చెయ్య మంటే వినడం లేదని కంప్లయింటు చేసింది.

అందర్నీ కూర్చోమంది. వారు వరండాలోని సోఫాలో కూర్చుందామనుకున్నారు. కానీ, అక్కడది లేకపోయే సరికి, ఆ సంగతే అడిగారు.

అది యెందుకు లేదో వివరించింది. అంత అందమైన సోఫాకి డిజైన్ మార్చడమేమిటా అనుకున్నారు.

ఈలోగా శ్యామల భాస్కర్‌కి ఫోన్ చేసింది. ఫైవ్ మినిట్సులో వస్తున్నానని చెప్పాడు. ఆ విషయమే చెప్పి, 'మీరు మాట్లాడుతుండండి. అత్తయ్యగారూ! నేను లోపల పని చూస్తా!' అంటూ వెళ్ళింది.

అంతా పిచ్చాపాటి మాట్లాడుతున్నారు. మాస్టారు మాత్రం భాస్కర్ తెలివితేటల్ని తెగ పొగుడుతున్నారు.

'ఇదేమిట్రా! ఈ మేస్టారి కాకా వ్యవహారం!' అనుకుంటూ ఆవిలించాడు రామకృష్ణ.

అంతలో కారు వచ్చిన శబ్దం.

"అదో! భాస్కర్ రానే వచ్చాడు!" అంటూ లేచింది తల్లి.

అంతా వరండాలోకొచ్చారు.

భాస్కర్ అందరికి 'సారీ' చెబుతూ వచ్చాడు. విరామంలేని అతని బాధ్యతలకు అందరూ ఒక వంక నొచ్చుకున్నా, మరొకవంక అతని కార్యదక్షతకు మెచ్చుకున్నారు.

అంతా కలిసి లోనికి వచ్చారు.

"మీరిక్కడ కూర్చోండి! అమ్మ నా మిసెస్‌ని మీకు పరిచయం చేసే వుంటారనుకుంటాను! నేను ఫైవ్ మినిట్సులో స్నానం చేసి, డ్రెస్ మార్చుకు వచ్చేస్తాను." అంటూ లోనికి వెళ్ళబోయి, ఒక్క నిమిషమాగి, వెనక్కొచ్చాడు.

"అమ్మా! ఇక్కడ సోఫా యేమైంది? లోపల వేయించావా?" అడిగాడు.

"లోపల వేయించడమేమిటి? నువ్వేగా యేదో డిజైను మార్పించాలని లారీని పంపావు! నిన్న సాయంత్రం వాళ్ళొచ్చి లారీలో తీసుకెళ్ళారు! మర్చిపోయావా?" తల్లి అంది.

ఆ మాటలకు షాకయిన భాస్కర్ వెంటనే తేరుకుని, "ఆ...ఆ!... మర్చిపోయాను! నేనే లారీ పంపాను!" అన్నాడు కాస్త తడబడుతూ, జరిగిన మోసాన్ని మిత్రులముందు బయటపడనీయకూడదని.

"యేవిట్రా? కొంపతీసి దొంగలేం...?" వెంకోజీ సందేహం వెలిబుచ్చాడు.

"నోనో! అదేం మాట? అలాంటివి మన వద్దేం సాగవు" అంటూ లోనికి దారితీశాడు, భాస్కర్.

భార్యని పిలిచి, రహస్యంగా అడిగాడు సోఫా సంగతి, ఆమె కూడా తన అత్తగారు చెప్పిన సంగతే చెప్పింది.


అది విని మళ్ళీ విస్మయం చెందాడు. భార్య కంగారు పడ్డది.


"యేమిటండీ? యేమిటీ విపరీతం? పట్టపగలు... పైగా మనింట్లోనా యీ దొంగతనం? మీకేదో తెలివిగల వాళ్ళని యింత పెద్ద పేరు కూడా వుందన్నారు కదండీ?" అంటూ బాధపడ్డది.

"ఇష్! నువ్వూరుకో! అవతల వాళ్ళున్నారు! మన పరువు పోతుంది! ఆ సంగతేదో నే చూసుకుంటాగానీ, నువ్వు ముందా భోజనాల వ్యవహారం చూడు!" అంటూ తన గదిలో కెళ్ళిపోయాడు.

భాస్కర్‌కి తల తిరిగిపోయింది. 'ఇంత డేరింగ్ దేరాబరీనా? అదీ తనింట్లో? తానింత తెలివిగల వాడు! తనకే మస్కా కొట్టాడంటే, వాడ్ని విడిచి పెట్టకూడదు! వాడి అంతు తేల్చాలి!"

గబగబా స్నానం చేసి, బట్టలు మార్చుకొని, తిన్నగా






వరండాకేసి వెళ్ళాడు. ఆ సోఫా వుండే చోటుని పరిశీలించి, గదిలోకి సాగాడు.

జరిగిన అవమానాన్ని, కలిగిన బాధని గుండెల్లోనే గుప్తంగా వుంచుకుని, చిరునవ్వు ముఖాన పులుముకొని, ఫ్రెండ్సు వద్దకు వచ్చి కూర్చున్నాడు.

"నీ తెలివితేటల గురించే అమ్మగార్కి చెబుతున్నానోయ్! చిన్నప్పటి నీ కృష్ణలీలలన్నీ వివరించాను!" మాస్టరన్నారు.

బలవంతంగా పెదాలమీదికి నవ్వు తెచ్చుకున్నాడు భాస్కర్.

అంతలో శ్యామల అత్తగార్ని పిలిచింది. ఆమె లేచి లోపలికి వెళ్ళింది.

"అసలు సోఫాకి డిజైను మార్చడం దేనికి? చాల బావుంది కదా?" వెంకోజీ అడిగాడు.

భాస్కర్ తలపట్టుకున్నాడు. 'వీళ్ళు ఆ టాపిక్ మార్చేలా లేరు. బాబోయ్!'

"ఒక షాపులో కొత్త డిజైన్ చూశాను. చాల బావుంది. అందుకే! అన్నట్టూ...మాస్టరూ!... మొన్న ఆ స్కూటర్ దొంగ స్కూటర్ బాక్సులో కిలో స్వీట్సూ, ఒక కవరూ పెట్టాడన్నారు కదా! యేం రాశాడు?" అడిగాడు.

"అవును! ఆరోజు బస్సు వస్తే చెప్పకుండానే వెళ్ళాను కదూ! అసలు నన్నడిగితే, తెలివితేటలు దొంగలకి యెక్కువ, ఆతర్వాతే పోలీసుల కంటాను!" అని మిగిలిన ముగ్గురు మిత్రుల వంకా చూచి, ఒక దరహాసం విసిరారు.

"ఆ స్కూటర్ దొంగ' వుత్తరంలో తన పేరు శ్రీరామచంద్ర మూర్తని వ్రాశాడు. సడన్‌గా భార్యకి పురుటినొప్పులొచ్చాయట! టాక్సీకని బయల్దేరాడుట! సమీపంలో దొరకలేదుట! సెంటర్‌కి వెళ్ళాలని వస్తూండగా, మన వాకిట్లో స్కూటర్ కనిపించిందట! 'ప్రాణవిత్తమాన భంగమందు బొంకవచ్చుట' అన్నట్టు తన భార్య ప్రాణం కాపాడడానికి, ఆ స్కూటర్, చెప్పకుండా వేసుకుపోయాడుట! టాక్సీని తీసుకొచ్చి, భార్యని హాస్పిటల్లో చేర్చాడుట! చేర్చిన అయిదు నిమిషాలకే అతని భార్య, మగబిడ్డని ప్రసవించిందిట! కనుక, మనస్ఫూర్తిగా తనను మన్నించమని కోరాడు! తన సంతోషంలో భాగం పంచుకొనమని పుల్లారెడ్డి స్వీట్ల ప్యాకెట్టు, అప్పుడే రిలీజైన 'బులెట్ ట్రైన్' సినిమాకి అయిదు రూపాయల క్లాసు టిక్కెట్లు పన్నెండు దాంట్లో పెట్టాడు.

"ఇంకేం వుంది! స్కూటరు దొంగతనం చేసిన శ్రీరామచంద్రమూర్తి మీద కోపం పటాపంచలై, ఆ స్థానంలో అతనిపట్ల సానుభూతి, అతను చూపిన ఔదార్యానికి సంతోషం కలిగింది. స్వీట్సు మాకూ, యిరుగుపొరుగువారికీ కూడా పంచారు!" మాస్టారన్నారు.

అంతలో "లేండి బాబూ భోజనాలకి!" అంటూ భాస్కర్ అమ్మగారొచ్చారు. అంతా కలిసి డైనింగ్ రూమ్‌కి నడిచారు.

కమ్మటి విందు భోజనం. చాలా రుచికరంగా వున్నాయి వంటకాలు. అంతా ఆరగిస్తున్నారు. కానీ భాస్కర్ మస్తిష్కం మాత్రం సోఫా దొంగ కోసం గాలిస్తూంది. భోజనాల టేబుల్ మీద గరెట్ల సవ్వడి తప్ప మరేమీ వినిపించడం లేదు.

"తప్పు చేసినా, ఒక రీజన్‌తో చేసాడు. అందుకు మెచ్చుకోవాలతనిని!" శర్మ మౌనాన్ని భంగపరిచాడు.

"వాడు యెంత స్వీట్లు కొనిపెట్టినా, చెప్పకుండా స్కూటర్ తీసుకెళ్ళి, కంగారు పెట్టడం తప్పే కదా! ఆ కేసు కొనసాగించాల్సింది మాస్టారు!" అన్నాడు రామకృష్ణ.

"మన భాస్కర్‌లాంటి వాడైతే, వాడి తెలివితేటలకి మెచ్చుకొని, సన్మానాలే చేసేవాడు!" మాస్టరు ప్రారంభించారు. "చివ్వరికి ఆ పన్నెండు సినిమా టిక్కెట్లు చేతిలో వుండిపోయాయి కదా! జనమంతా మెచ్చుకుంటున్న సినిమా మరి! అందుకే వాళ్ళు నలుగురూ, మేము నలుగురం, మా పక్కింటి వాళ్ళిద్దరూ, ఆ పక్కింటి వాళ్ళిద్దరూ మొత్తం పన్నెండు మందిమి కలిసి, ఆ తరుపరి ఆదివారం రాత్రి రెండవ ఆటకు రిజర్వేషన్ టిక్కెట్లు పట్టుకెళ్ళాం.

"ఆ సినిమా యెంత బావుందని! ఆనందంగా చూచి, తిరిగి రాత్రి వంటి గంటలోపే యిళ్ళు చేరాము, ఆ శ్రీరామ చంద్రమూర్తిని మెచ్చుకుంటూ.

"యెవరిళ్ళకు వాళ్ళు చేరి, తాళాలు తీసి, లోపలికి అడుగుపెట్టేసరికి, యేవుంది? సర్వం దొంగల దోపిడీ! యెవరికి వాళ్ళు లోబోదిబోమని గోలపెడుతూ రోడ్డున పడ్డాం! యెవరమైతే ఆ వుచితార్థపు టిక్కెట్లకు ఆశపడి, తలుపులు తాళాలు పెట్టామో, ఆ యిళ్ళనీ నిలువునా దోచేశాడు. ఆ శ్రీరామచంద్రమూర్తి నాయనా!" అని, గ్లాసెడు నీళ్ళు గడగడా త్రాగారు మాస్టారు.

అంతా తెల్లబోయారు.

భాస్కర్‌కూడా కాస్త జంకినట్లే కనిపించాడు.

"మళ్ళీ పోలీసు రిపోర్టిచ్చాం. కానీ, యింతవరకూ ఫలితం శూన్యం!" మాస్టారు అన్నారు భోజనం ముగించి.

"నేను చూస్తా మాస్టర్! మీరు కాస్త ఆ రిపోర్టిచ్చిన తేదీ వగైరా వివరాలు నాకు పంపండి! ఈ వూళ్ళో కాస్త గట్టి బుర్రలే వున్నాయన్నమాట!" అంటూ లేచాడు పోలీసు కమిషనర్ భాస్కర్.

"యేరా! సరిగ్గా భోం చెయ్యలేదు! మనసు బాగాలేదా?" వెంకోజీ భాస్కర్ వదిలేసిన అన్నం వంక చూచి అడిగాడు.

"అబ్బే! అదేం లేదు! రాత్రి నిద్రలేదుకదా! అందుకని!" సర్ది చెప్పుకున్నాడు, భాస్కర్.

కాసేపు విశ్రాంతి తీసుకొని, భాస్కర్‌ని రెస్టు తీసుకోమంటూ లేచారు మాస్టారు. అంతలో రామకృష్ణ ఒక ప్రపోజల్ పెట్టాడు. "ఒరేయ్ భాస్కర్! నువ్వు అమ్మని, వదినగార్ని, పిల్లల్నీ వెంటబెట్టుకొని యెల్లుండి మన వెంకోజీ యింటికి భోజనానికి రావాలి! మనందరం అక్కడే భోం చేద్దాం! ఆరోజు అందరికీ సెలవే"

ఆ మాటలకు శర్మ, వెంకోజీ ముఖముఖాలు చూసుకున్నారు. 'మా యింటికి నేనిన్వయిట్ చెయ్యాలి గానీ, వీడేవిటి?' అని.

"చూడండమ్మా! బంధుప్రీతికన్నా, మిత్ర ప్రీతే మంచిది. మన రామకృష్ణ చెప్పినట్టు వెంకోజీ ఇంట భోజనాలయ్యాక, పై ఆదివారం శర్మ, అటుపై ఆదివారం రామకృష్ణ, కడపటి ఆదివారం మా యింట్లో మీ అందరికీ భోజనాలు! ఇది ఖరారు! ఇహ మాకు సెలవిప్పించండి!" అని లేచారు.

సరేనంటూ, గేటు వరకు సాగనంపినా, భాస్కర్ గుండెల్లో సోఫా దొంగ మీద చెప్పలేనంత పగ రగులుతూంది!

'యెవరు?...యెవరు?...యెవరు?...'

పై సంచికలో